మిగిలిందిక చింతే..!

పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే అక్కడున్న ఆదాయమార్గాలను సద్వినియోగం చేసుకోవాలి. అప్పుడే పంచాయతీలకు స్థానికంగా కొంతవరకు ఆదాయం లభిస్తుంది. ఆయా పంచాయతీలలోని ఆర్అండ్‌బీ రోడ్లపక్కనున్న చింతచెట్ల ఫలసాయాన్ని ఏటా వేలం వేసి ఆదాయం పొందడం పరిపాటి. అయితే ఈసారి ఇప్పటికే చింతకాయలు మాగి చెట్ల నుంచి రాలిపోతున్నా వేలం వేయకపోవడం గమనార్హం! మరో పదిరోజుల సీజన్ ముగుస్తుంది. ఇక, ఇదే అవకాశంగా ఎవరికి వారు చెట్ల నుంచి చింత కాయలు రాల్చుకుని పట్టుకుపోతున్నారు.

- చింతచెట్లను వేలం వేయని అధికారులు
- ఆర్అండ్‌బీకి మార్జిన్‌మనీ కట్టని సర్పంచులు
- ఇప్పటికే చెట్లనుంచి రాలిపోతున్న మాగిన కాయలు
- చెట్లలోని కాయలను రాలుపుకుపోతున్న కొందరు
- పది రోజుల్లో ముగుస్తున్న సీజన్
- ఈసారి పంచాయతీలకు చింత ఆదాయం పోయినట్టే!


టి.వడ్డూరు పంచాయతీ పరిధిలో చింత చెట్టు కింద కాయలు ఏరుకుంటున్న గ్రామీణులు

పలమనేరు: మండలంలో కొన్ని పంచాయతీల పరిధిలో ఉన్న ఆర్అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా చింతచెట్లు ఉన్నాయి. వీటి ఫలసాయాన్ని పంచాయతీలు వేలం వేసి ఆదాయాన్ని సమకూర్చుకోవాలి. ఇందుకోసం ఆయా సర్పంచులు ఆర్అండ్‌బీ అధికారులకు నిర్దేశిత మార్జిన్ మనీ చెల్లించాలి. ఆపై ఈ తీర్మానాన్ని ఈవోఆర్డీ ద్వారా డీపీఓ(జిల్లా పంచాయతీ అధికారి) ద్వారా అప్‌సెట్ ప్రైజ్ నిర్ణయించి బహిరంగ వేలం వేయడానికి అనుమతి పొందాలి. ఆ తర్వాత సంబంధిత పంచాయతీ కార్యాలయం వద్ద ఫలాన తేదీ వేలం వేయనున్నట్టు అన్ని గ్రామాల్లో దండోరా వేయించాలి. వేలంలో ఎవరైతే ఎక్కువ రేటుకు పాడుతారో వారికి చెట్ల ఫలసాయం పొందే హక్కు కల్పిస్తారు. ఇదీ నిబంధనల ప్రకారం చేయాల్సిన ప్రక్రియ.

ఇక్కడ ఏం జరుగుతోందంటే...!

సాధారణంగా ఈ ప్రక్రియ మొత్తం జనవరిలోనే మొదలెట్టాలి. చింత కాయలను రాల్చే సీజన్‌కు ముందే వేలం పెట్టాలి. కానీ పలమనేరు మండలంలోని పలువురు సర్పంచులు ఆర్అండ్‌బీ పరిధిలోని చెట్లకు ఇప్పటివరకూ మార్జిన్‌మనీ కట్టలేదు. దీంతో పంచాయతీ తీర్మానం డీపీఓ కార్యాలయానికి వెళ్లలేదు. ఇప్పటికే చింత చెట్లలోని కాయలు రాలిపోతున్నాయి. మరికొన్నింటిలో కొందరు రాల్చుకెళుతున్నారు. ఇప్పటికిప్పుడు సర్పంచులు ఈ తంతంగాన్ని చేసినా మరో పదిరోజుల్లో చెట్లలోని కాయలు నేలరాలిపోతాయి. ఆపై వేలం పెట్టినా కాయలు లేని చెట్లు కొంటే నష్టం తప్పదని వ్యాపారులు వేలం పాటకు అస్సలు రారు. ఫలితంగా చింతచెట్ల ఫలసాయం పంచాయతీలకు దక్కకుండా పరులపాలు అవుతోంది. గత ఏడాది సగటున రూ.36వేల వరకూ కొన్ని పంచాయతీలకు చింతచెట్ల ఫలసాయం రూపేణా ఆదాయం పొందాయి. ఈ పర్యాయం వేలం వేయకపోవడం వల్ల పంచాయతీలకు మిగిలేది 'చింతే'నసే ప్రస్తుత పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి.

ఏం చేద్దాం? సర్పంచులకు చెప్పాం!

ఇప్పటికే సర్పంచులకు చెప్పి ఆర్అండ్‌బీ వారికి మార్జిన్‌మనీ కట్టాలని చెప్పాం. వారు స్పందించకుంటే ఏం చేయాలి? వారు ఆ డబ్బును కట్టి పంచాయతీ తీర్మానాన్ని తెస్తే మేము డీపీఓకు పంపి, అప్‌సెట్ ప్రైజ్ నిర్ణయించి, వేలం నిర్వహించేలా చర్యలు తీసుకునేవాళ్లం. చెట్లలో ఉన్న కాయలంతా గాలికి రాలడం, ఎవరెవరో రాల్చుకెళుతున్న విషయం తెలిసింది. ఏమి చేయాలో అర్థంకావడం లేదు.

–ఖాదర్‌బాషా, ఎంపీడీఓ, పలమనేరు

క్లుప్తంగా

పెద్దిరెడ్డిని కలిసిన జెడ్పీ చైర్మన్



చిత్తూరు కార్పొరేషన్: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సోమవారం తిరుపతిలోని ఆయన నివాసంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని పలు విషయాలపై చర్చించామని, ప్రస్తుతం ఉన్న ప్రజా సమస్యలు, ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా ప్రజలను దగా చేయడం, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత ఇత్యాది వాటి గురించి చర్చించినట్లు చెప్పారు. ఆయనతోపాటు శాంతిపురం జెడ్పీటీసీ శ్రీనివాసులు ఉన్నారు.

ఘనంగా తిరునాళ్ల ప్రారంభం

సదుం: మండలంలో జంగంపల్లెలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో తిరునాళ్ల ఘనంగా ప్రారంభమైంది. సోమవారం ధ్వజా రోహణం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 11న స్వామి వారికి అభిషేకం, పూజలు, రాత్రి చెక్క భజనలు, కోలాటాలు, దేవరెద్దు పూజ, అన్నదానం, 12న శివపార్వతుల కల్యాణోత్సవం, గ్రామోత్సవం, రథోత్సవం, 13న వసంతోత్సవం, పార్వేట ఉత్సవం, పవళింపు సేవతో తిరునాళ్ల ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

భక్తిప్రపత్తులతో విగ్రహ ప్రతిష్ఠాపన


శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

పుంగనూరు: పట్టణంలోని కొత్తయిండ్లలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వేదపండితులు గణపతి హోమం, ప్రాణప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం, విశేష అలంకరణ, వేద పారాయణం, మంత్రపుష్పంతో మహా మంగళహారతి కావించారు. భక్తులు అధిక సంఖ్యలో సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వాహకులు అన్నదానం చేశారు.

విద్యార్థులకు కళ్లద్దాలు


పిల్లలకు కళ్లద్దాలను తొడుగుతున్న ఎమ్మెల్యే

పలమనేరు: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటేనే వారికి చదువుపై శ్రద్ధ, ఆసక్తి కలుగుతుందని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అన్నారు. సోమవారం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఉచితంగా అందజేసిన కళ్లద్దాలను 83మంది పిల్లలకు సోమవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. పిల్లలు ఎక్కువగా స్మార్ట్‌ఫోన్లు చూడకుండా తల్లిదండ్రులు చూడాలన్నారు. అనంతరం నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై శిక్షణ

కుప్పం: స్వయం ఉపాధిపై కడా కార్యాలయంలో ఐదు రోజుల శిక్షణ తరగతులను సోమవారం కడా పీడీ వికాస్ మర్మత్ ప్రారంభించారు. అలిప్, కడా, డీఆర్‌డీఏ, మెప్మా, ఏపీఎస్ఎస్‌డీసీ సమన్వయంతో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్వయం ఉపాధికి సంబంధించిన కార్యక్రమాలపై యువతకు అవగాహన కల్పిస్తామని, దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలే ఎక్కువ


ఆర్డీఓ కార్యాలయం వద్ద అర్జీదారులు

పలమనేరు: పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో 20 వరకూ వినతులు అందాయి. వీటిలో ఎక్కువగా రెవెన్యూ సంబంధిత సమస్యలే వచ్చాయి. వీటిని ఆయా తహసీల్దార్ కార్యాలయాలకు పంపి త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ భవాని ఆదేశించారు. కొన్ని సమస్యలపై అక్కడే అందుబాటులో ఉన్న అధికారులతో ఆమె మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం: నియోజకవర్గంలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ కృష్ణవేణి తెలిపారు. కుప్పం మండలం వేపూరులో అంగన్‌వాడీ హెల్పర్ , గుడుపల్లె మండలం సంగనపల్లెలో అంగన్‌వాడీ హెల్పర్, శాంతిపురం మండలం కోటగడ్డలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త, రామకుప్పం మండలం పంద్యాలమడుగులో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. పదవ తరగతి పాసై నిర్దేశించిన సామాజిక వర్గాల్లో అర్హత ఉన్నవారు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పుంగనూరు, సోమలలో..

పుంగనూరు: పుంగనూరు ఐసీడీఎస్ పరిధిలోని వివిధ అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ రాజేశ్వరి కోరారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని రాంనగర్ ఏరియాలో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టు ఓసీలకు, సోమల మండలం ముంద్రివారిపల్లెలో సహాయకురాలి పోస్టు బీసీ–బి కేటగిరి వారికి కేటాయించామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 22 సాయంత్రం 5లోపు దరఖాస్తు చేయాలని, పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కల్యాణ వైభోగమే..!


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

వి.కోట: పట్టణంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం కల్యాణోత్సవం భక్తజన సందడి నడుమ వేడుకగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం ఆలయంలో ప్రత్యేకపూజలు అభిషేకాల అనంతరం మండల విశ్వ బ్రాహ్మణ సంఘం స్వామివారి కాశీయాత్ర కార్యక్రమాన్ని పుర వీధుల్లో నిర్వహించింది. కల్యాణోత్సవానికి సర్పంచ్ పీఎస్ లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు మేళతాళాలు, మంగళవాయిద్యాల హోరు నడుమ పట్టువస్త్రాలు తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం రుత్వికులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. నిర్వాహకులు ఆలయం వద్ద అన్నదానం చేశారు. రాత్రి స్వామి వారిని మండల బలిజ సంఘం ఆధ్వర్యంలో స్వామివారిని గరుడ వాహనంపై మంగళ వాయిద్యాలు, పండరి భజనలు, కోలాటాల నడుమ ఊరేగించారు. ఉభయదారులు భక్తులకు తీర్థ,ప్రసాదాలు పంపిణీ చేశారు. విశ్వ బ్రాహ్మణులు, మండల బలిజ సంఘ నాయకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ ధర్మకర్త సీతారామయ్య, భక్తులు పాల్గొన్నారు.


విశ్వ బ్రాహ్మణులు నిర్వహిస్తున్న కాశీయాత్ర

అగ్ని ప్రమాదం

పుంగనూరు: మండలంలోని బత్తలాపురం గ్రామ సమీపంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన కృష్ణప్ప నీలగిరి తోటలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను ఆర్పివేశారు. ఎండలు మొదలవుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎండిన ఆకులు, రోడ్డు పక్కన ఉన్న చెత్తపై బీడీలు, సిగిరెట్లు తాగి పారవేయరాదని, వీటివల్ల అగ్ని ప్రమాదాలకు తావిచ్చినట్లవుతుందన్నారు.

20న నంద్యాలలో సమావేశం

పుంగనూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాలను నిరసిస్తూ ఈనెల 20న నంద్యాలలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎస్‌డీపీఐ నాయకులు తెలిపారు. దీనికి సంబంధించి సోమవారం పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ముస్లింలకు చెందిన ఆస్తులను కాపాడుకునేందుకు కులమతాలకతీతంగా నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. నంద్యాల సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం

వి.కోట: పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి మండలాల మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి ప్రజాప్రతినిధులకు తన ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

విశిష్ట గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

పలమనేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గుర్తింపుగా అందజేసే విశిష్ట గుర్తింపు కార్డులు ఈనెల 28లోపు రైతులు విధిగా పొందాలని పలమనేరు వ్యవసాయాధికారిణి సంధ్య కోరారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడారు. అన్ని రైతుసేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయన్నారు. దీనికోసం ఆధార్, పట్టాదారు పాసుబుక్కు, వీటికి లింకు అయిన మొబైల్ నెంబరు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పంటలబీమా, పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ లాంటి పథకాల ఫలాలు పొందాలంటే తప్పనిసరిగా ఈ కార్డు ఉండాలన్నారు. ఆర్ఎస్‌కే అధికారులకు ఫోన్ చేసి ఓటీపీని చెప్పి నమోదు చేసుకోవచ్చన్నారు.


పలమనేరు పట్టణ ఆవాస ప్రాంతం, రోడ్డు




పదిగంటల తర్వాత కనిపిస్తున్న భానుడు

మంచు దుప్పట్లో..!

పలమనేరు: నియోజకవర్గంలో సోమవారం ఉదయం పదిగంటలైనా మంచు వర్షంలా కురవడంతో సూరీడు ముఖం చాటేశాడు. దట్టంగా కురుస్తున్న మంచు మూలాన ముందున్న చెట్లు, దారులు కూడా కనిపించలేదు. మరోవైపు తీవ్రమైన చలికారణంగా జనం ఇళ్ల నుంచి బయటికి రాలేదు. పొద్దునే పాడిరైతులు పాలుపితకడం, పాలుపోయడం, ఇక సేద్యం పనులు మాత్రం మంచులోనే చేయడం కనిపించింది. హైవే, ఇతర రహదారుల్లో అయితే ముందు వెళ్లే వాహనాలు సైతం కనిపించక వాహనచోదకులు హెడ్‌లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వచ్చింది. సాధారణంగా జనవరి నెలాఖరుకల్లా మంచు ప్రభావం తగ్గడం పరిపాటి. అయితే ఫిబ్రవరి మొదలై పదిరోజులవుతున్నా ఇప్పటికీ మంచు దట్టంగా కురుస్తూ శీతాకాలాన్ని తలపిస్తోంది.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నిర్మూలన

–విద్యార్థులకు మాత్రల పంపిణీలో అధికారులు

పలమనేరు: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని 1నుంచి 19 ఏళ్లలోపు వారికి సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ–1 లీలారాణి, పెంగరగుంటలో ఎంఈఓ–2 బాలసుందరం ఈ మాత్రలను విద్యార్థులకు మింగించారు. ఈ మాత్రల వల్ల కడుపులోని నులిపురుగులు చనిపోతాయని, రక్తహీనత సమస్య నుంచి పిల్లలు బయటపడి ఆరోగ్యం ఉంటారన్నారు. మండలంలో మొత్తం 5,825మందికిగాను 5,337మందికి పంపిణీ చేసినట్లు కొలమాసనపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సుధారాణి తెలిపారు. హెచ్‌ఎంలు విజయనాథ్, షంషీర్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగవరం మండలంలో..

గంగవరం: గంగవరం జెడ్పీ హైస్కూల్‌లో, మామడుగు జెడ్పీ హైస్కూల్‌లో వైద్యాధికారులు శ్రీనివాసులు, మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. గంగవరం పీహెచ్‌సీ పరిధిలో 9,742 మంది విద్యార్థులకు, పత్తికొండ పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 4975 మందికి మాత్రల పంపిణీ చేసినట్లు చెప్పారు. వైద్యాధికారి లహరి, ఆరోగ్య, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్యాధికారి టి. మురళి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంఈఓ గోపాల్ రెడ్డి, హెచ్‌ఎం కేశవపిళ్లై తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు అరుణ్‌కుమార్, విజయ్‌చంద్ర మాట్లాడారు. హెల్త్ ఎడ్యుకేటర్లు సావిత్రమ్మ, కాంతమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో నులిపురుగుల నిర్మూలన అవగాహన పోస్టర్లను ఈస్ట్‌పేట అర్బన్ హెల్త్‌సెంటర్ మెడికలాఫీసర్ డాక్టర్ రంజిత విడుదల చేసి మాట్లాడారు. పిల్లలు ప్రతి ఒక్కరూ చేతుల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అలాగే శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో మాత్రలు పంపిణీ చేశారు.




పలమనేరు: హైస్కూల్‌లో పిల్లలకు మాత్రలను వేస్తున్న ఎంఈఓ లీలారాణి, గంగవరం: పిల్లలకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి లహరి, పెద్దపంజాణి మండలంలో..




బైరెడ్డిపల్లె: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్, పుంగనూరు: పోస్టర్లు విడుదల చేస్తున్న డాక్టర్ రంజిత, చౌడేపల్లె: మాత్రలు వేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ జయప్రకాష్, వైద్యాధికారి పవన్‌కుమార్ వైద్య సిబ్బందితో కలిసి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మండలంలో 1నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న 9808 మందికి ఈ మాత్రలు పంపిణీ చేసినట్టు చెప్పారు. సూపర్‌వైజర్ బహుద్దీన్, ఏఎన్ఎం లత, లెక్చరర్ బాలాజి తదితరులు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: చెరుకువారిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాల, వెటర్నరీ కళాశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ గిరీషా తెలిపారు. డాక్టర్ చరణ్, సిబ్బంది ఉదయ భాస్కర్, నీలకంఠ, శిఖామణి పాల్గొన్నారు.

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు హైస్కూలు విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన మాత్రలను వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. కల్లూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో 2,242 మంది పిల్లలకు ఈ మాత్రలు వేసినట్టు మెడికలాఫీసర్ డా.జానకీరావు తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

3,988 మంది పిల్లలకు..

రొంపిచెర్ల: మండలంలో 3,988 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశామని రొంపిచెర్ల పీహెచ్‌సీ వైద్యులు దినేష్ కుమార్ నాయక్, వినయ్ తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో మాత్రలు పిల్లల చేత మింగించినట్టు చెప్పారు. 98.2 శాతం మంది పిల్లలకు మొదటి రోజే మాత్రలను వేశామని, మాత్రలు వేయని పిల్లలకు ఈ నెల 17న వేస్తామని చెప్పారు. సీహెచ్‌వో కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సదుం: మాత్రలు మింగిస్తున్న ఆరోగ్య సిబ్బంది


కల్లూరు హైస్కూల్లో..


రొంపిచెర్ల: దద్దాలవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో మాత్రలను వేస్తున్న డాక్టర్లు

రైతులందరికీ గుర్తింపు నంబర్లు

పుంగనూరు: పుంగనూరు వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని రైతులందరికి ప్రత్యేక గుర్తింపు నంబర్లు, కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టినట్టు ఏడీ శివకుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మేరకు రైతులకు ప్రత్యేక ఐడీ నంబర్లు ఇవ్వడానికి గ్రామాల్లో రైతుసేవా కేంద్రాల్లోని ఇన్‌చార్జ్‌లు నమోదు కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఈనెలాఖరు నాటికి ఐడీ కార్డులు ఇచ్చే కార్యక్రమం పూర్తి చేస్తామని, రైతులు తమ ఆధార్, భూమి తదితర వివరాలను తమ మొబైల్ ఫోన్‌లో కలిగి ఉండాలన్నారు. దీనిపై ప్రతి గ్రామంలోను రైతు సేవా కేంద్రాల సిబ్బంది అవగాహన, నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ఏవైనా సందేహాలు ఉన్న పక్షంలో ఆర్ఎస్‌కెలలో సంప్రదించాలన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులు

పెద్దపంజాణి: మండలంలో లింగాపురం సమీపంలోని మదర్ థెరిసా పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ డాక్టర్ రవీంద్ర బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ డేవిడ్ బెర్కిమాన్స్, అధ్యక్షత వహించిన డాక్టర్ ఖలీలుల్లా మాట్లాడారు. విద్యార్థులు అన్నింటా విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.